



# జవాబు

సిగ్గుతో తల వంచి కూర్చొన్న మాధవిని "ఒకసారి తలెత్తి చూడు" అని అన్నారెవరో మెల్లగా.

మరింత సిగ్గుపడుతూనే తలెత్తి చూసింది మాధవి—ఎదురుగా కూర్చున్న పెళ్ళికొడుకుని.

ఆ చూడటంతోనే పెనుగాలికి ఊగి పోయే లతలా వణికిపోయింది. ఆమె మస్తిష్కం స్తంభించి పోయింది. ఆమె కళ్ళలో నీ ళ్ళింకిపోయి, భయం ఆవరించుకుంది.

మాధవి తలెత్తి చూసేసరికి అంతవరకు ఎంతో కుతూహలంగాఉన్న సుధాకర్‌కు షాక్ తగిలినట్టయినా. తొట్రుపడకుండా చిరునవ్వు నవ్వాడు.

* * *

తన తండ్రి రామనాథం తల్లితో అంటున్నప్పుడు విన్నది మాధవి.

"అబ్బాయి చాలా బాగుంటాడు. ఐ. ఎ. ఎస్. పాసయి అసిస్టెంట్ కలెక్టరు ట్రెయినింగ్‌లో ఉన్నాడు. అబ్బాయి తండ్రి కూడా మంచి వాడు. వారికి కట్నం ముఖ్యం కాదట. అమ్మాయి నచ్చితే చాలట. ఈ ప్రయత్నం కొంత ఆశాజనకంగానే ఉంది."

తండ్రి మాటలు మాధవిలో తీయని కోర్కెలు రేపాయి. ఆమె ఊహలు నభో వీధిని ఊయల లూగ సాగాయి. తను అతన్ని చూడకపోయినా చూచినంతగా, తన మనస్సు హరించుకు పోయినంతగా మురిసి పోయింది. తనప్పుడే అతని అర్ధాంగి అయిపోయి నట్టుగా సంబరపడిపోయింది.

తను అతనికి తప్పకుండా నచ్చి తీరుతుంది. తను చదివే రోజుల్లో కాలేజీ బ్యూటీగా వెలుగొందింది. తనతో మాట్లాడాలని ఆశపడే వారిలో స్టూడెంట్సే కాదు, లెక్చరర్లు కూడా ఉండడం తనకు తెలుసు. అయినా తనకు అదేమంత అద్భుతంగా కనిపించలేదు. గర్వంగానూ అనిపించలేదు.

ఆ నాడు తను స్పెషల్ క్లాస్ అయిన తరువాత బయటి కొచ్చింది. సుధాకర్ కాలేజి కాంపౌండులో చెట్టు క్రింద ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టుగా నిలబడి ఉన్నాడు.

సుధాకర్‌ని చూస్తే మాధవికి వెంటనే స్ఫురించేది, నవ్వు తెప్పించేది "అందమైన మొద్దబ్బాయ్" అనే అతని నిక్ నేమ్. తనతోపాటే తన క్లాస్ చదువుతున్నాడు. చాలా అమాయకంగా—మెత్తగాఉంటాడు. ఎవరితోనూ కలవడు. పరీక్షల్లో మార్కులు కూడా అంతంతగానే వస్తాయని అందరూ అంటుంటే తనెన్నోసార్లు వింది. ఎవరైనా ఎగతాళిగా మాట్లాడినా సుధాకర్ పట్టించుకోడు. ఒక్కోసారి ఆడపిల్లలు వెనగ్గా వస్తూ అతనికి వినిపించేటట్టుగా ఎగతాళి చేస్తుంటారు. అయినా అతను వెనక్కు కూడా తిరిగి చూడడు.


## సనగరం పార్థసారథి

అప్పుడు తనవైపు చూసి, చిరునవ్వు నవ్వాలని తాపత్రయ పడుతున్నట్లుగా ఉంటాడు. మిలమిలలాడుతున్న కళ్ళతో తను చూసేసరికి అతను భయపడిపోయి, తలవంచుకొని వెళ్ళి సీట్లో కూర్చుంటాడు. తనకు తెలిసినంతవరకు అతనికి స్నేహితుల్లేరు. "ఎవరికోసం ఎదురు చూస్తున్నాడో?" అని అనుకుంటూ తను వస్తుంటే, "మాధవీ", అని మెల్లగా పిలిచాడు సుధాకర్.

తనకు ఆశ్చర్యం కలిగించింది సుధాకర్ పిలుపు. తన వైపు చూడడానికే భయపడే అతను తనను పేరెట్టి పిలవడమా అని అనుకుంటూ అతనికి దగ్గరగా వెళ్ళింది.

అప్పటికే అతని ముఖం మీద చెమట బిందువులు కనిపించాయి—అతను భయపడుతున్నట్టుగా.

అతను ఒకడుగు ముందుకు వేసి తన కుడిచేయి గట్టిగా పట్టుకొని, ముద్దుపెట్టుకుంటూ వదలేదు.



మద్రాసులోని సాహితీ సాంస్కృతిక సంస "కళా భారతి' వారు నటరత్న శ్రీ ఎ. టిం రామారావును సన్మానించిన సందర్భంగా జరిగిన సభలో ఉత్తమ నాటకాలు ప్రదర్శించిన సంస్థగా నిడదవోలు రాఘవ కళా నిలయానికి మొమెంటో బహూకరించి నప్పటి చిత్రం

ఊహించని ఈ విపరీత చర్యకు తను భయపడి పోయినా ధైర్యం కూడదీసుకుని అతని ముఖం మీద ఎడమ చేతిలోని పుస్తకాలతో కొట్టింది. అతన్నుండి తన చేతిని బలవంతంగా లాక్కొని అక్కడి నుండి పరుగెత్తింది. వెనక వస్తున్న తన క్లాస్ మేట్స్ నవ్వడం వినిపించింది మాధవికి.


* * *

"పోస్ట్!" అని పోస్ట్ మన్ అరుస్తున్నాడు.

"మాధవీ! పోస్టు వచ్చినట్టుంది—చూడు!" అని తల్లి కూడా అరవడంతో మాధవి నీరసంగా వెళ్ళింది ఉత్తరం అందుకోడానికి.

"మాధవిగారికి రిజిస్టర్డు కవర్" అన్నాడు పోస్ట్ మన్.

సంతకంచేసి కవరు అందుకుంది కుతూహలంగా. కవరు మీద ఉన్న ఫ్రమ్ అడ్రస్ చూడగానే



ఒంటిమీద తేళ్ళు, జెర్రులు ప్రాకినట్టయింది మాధవికి. ఆ కవరును ముట్టుకోడానికి మనస్కరించలేదు.

కవరు విప్పి చదవకుండానే గదిలో టేబిల్ మీద పడేసి, నిరుత్సాహంగా మంచం మీద పడుకొంది మాధవి.

"ఎక్కడనుండే ఉత్తరం?" వంటింట్లోనుండి తల్లి కేక పెట్టింది.

మాధవి జవాబు చెప్పకపోవడంతో మళ్ళీ కేకేసింది—"పెళ్ళివారి నుండేనా?" అని.

"కాదులేవే. నా స్నేహితురాలి వద్ద నుండి." విసుగ్గా అంది కళ్ళు మూసుకుంటూ.

కళ్ళు మూసుకున్నా మనస్సుకు కళ్ళు లేవు గనుక, అది మేల్కొనే ఉంది. కళ్ళాలు లేని ఆలోచనలు వెనక్కు పరుగుదీస్తున్నాయి గతాన్ని పట్టుకొని.

• • •

ఆ నాడు కాలేజీ నుండి ఇంటికి వచ్చిన మాధవికి చాలా అవమానంగా ఉంది. కాలేజీకి వెళ్ళి తన క్లాస్ మేట్స్ మధ్య ఎలా కూర్చోవడమా అన్న భయం పట్టుకుంది. వెళ్ళకపోతే తన చదువు, తన భవిష్యత్తు అయోమయంగా, అంధకారం అవుతుంది.

సుధాకర్ మీద అంతవరకు ఉన్న జాలి పోయి కోపమొచ్చి తెగ తిట్టుకొంది. "అందమైన మొద్దబ్బాయి కాదు, పయోముఖ విషకుంభం. మేక వన్నె పులి. స్కౌండ్రల్ ... రోగ్..." అని తిట్టుకుంటూనే భోరున ఏడ్చేసింది.

జరిగిన సంఘటనను తనేగాక చూచిన వాళ్ళు కూడా మరిచిపోతే ఎంత బాగుండును! కాలేజీకి వెడితే తన్ను ఊరికే వదిలేస్తారా? తన పేరు గోడలమీద కెక్కించి అవమానించి తన ప్రాణం తీసేస్తారు.

సుధాకర్ తీసుకున్న ధైర్యమే మరొకరు ఆసరాగా తీసుకుంటే తనిక బ్రతగ్గలదా? తనింక కాలేజీకి వెళ్ళనని తండ్రి కెలా చెప్పగలదు? ఇరుగు పొరుగువారి ప్రశ్నలకు తను బదు లెలా చెప్పగలదు?

ప్రిన్సిపాల్‌కు చెప్పి ఆ సుధాకర్ గాణ్ణి కాలేజీ నుండి డీబార్ చేయించాలి. లేకపోతే మిగతా వాళ్ళు విజృంభించి పోతారు. అయినా తను వెళ్ళి రిపోర్టిస్తే, ప్రిన్సిపాల్ నమ్ముతాడా? సుధాకర్ వట్టి అమాయకుడు, ధైర్యం లేనివాడనే ప్రిన్సిపాల్‌కి కూడా నమ్మకం. తనే అతని మీద నిందారోపణ చేస్తూందని తననే దండిస్తాడేమో?

అంత అయోమయంగా, భవిష్యత్తు భయంకరంగా తోచింది మాధవికి.

ఆలోచించిందే ఆలోచిస్తూ, తల్లికి, తండ్రికి చెప్పుకోలేక, చేతగాక ఏడుస్తూ నిద్రపోయింది.

ఎంత ప్రొద్దెక్కినా మాధవి లేవకపోయేసరికి తల్లి వచ్చి లేపింది.

మాధవి మెల్లగా కళ్ళు తెరిచి, "జ్వరం వచ్చినట్టుందమ్మా" అంది.

వెళ్ళిపోతున్న ఆమె తల్లి వెనక్కు వచ్చి, నుదుట చెయ్యి పెట్టి చూసింది. "జర్వం ఎక్కువగా ఉంది. మీ నాన్నగారికి చెప్పి వస్తా" అని వెళ్ళింది.

ఆ జ్వరం టైఫాయిడ్ క్రిందకు దిగింది.

"తనను గురించి క్లాసులో ఏమనుకుంటున్నారో సుధాకర్ తను ఘనవిజయం సాధించినట్టుగా అనుకుంటున్నాడా? తను జ్వరం తగ్గి కాలేజీకి వెళ్ళితే అతన్ని అవమానించి—ఏడిపించి తీరాలి ..." అని అనుకొంది ఒకనాడు జ్వరం తగ్గి, మెలకువగా ఉన్నప్పుడు.



ఆ తరవాత నాలుగు రోజులకు మాధవి క్లాస్ మేటు ప్రేమ పలకరించడానికి వచ్చింది.

ప్రేమను చూడగానే మాధవికి ఉత్సాహం కలిగింది. కాలేజీ విషయాలు, క్లాసు పాఠాలు గురించి అడిగి తెలుసుకోవా లనుకుంది. కాని అంతలోనే జరిగిపోయిన సంఘటన గుర్తు కొచ్చింది. ప్రేమ ఆ విషయాన్ని గురించి అడగాలని వచ్చిందేమోనని భయపడింది.

ప్రేమ కాలేజీ విషయాలు అన్నీ చెప్పింది—మాధవి అడగకుండానే.

కాని సుధాకర్ సంగతి ఎంత సేపటికి చెప్పకపోయేసరికి మాధవిలో కుతూహలం పెరిగింది. అతని విషయం అడగడానికి జంకువేసింది.

"మాధవీ! నీ కొక విషయం చెప్పాలనే వచ్చాను. ఇంతకుముందు ఒకసారి వచ్చాను. కానీ నీకు జ్వరం ఎక్కువగా ఉండడం చేత వీలుకాలేదు." మాధవిని పరిశీలనగా చూస్తూ అంది ప్రేమ.

సుధాకర్ తనను అవమానించడం క్లాసులో పెద్ద సబ్జక్టయి ఉంటుంది. తనను గురించి ఎవరెవరు ఏమనుకుంటున్నారో చెపుతుందని భయపడింది మాధవి.

"ఆ రోజు జరిగిన సంఘటన తరవాత సుధాకర్ కాలేజీకి రాలేదు. ఇక మీదట రాడు కూడా!" అంది ప్రేమ.

"ప్రిన్సిపాల్ కాలేజీ నుండి డిస్మిస్ చేసి ఉంటారు. తగిన శాస్తి జరిగింది. స్కౌండ్రల్" అంది మాధవి కసిగా.

"ప్రిన్సిపాల్ డిస్మిస్ చేయలేదు. తనే టి. సి. తీసుకొని వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయే ముందు నన్ను కలిసి ఈ కవరు నీ కివ్వమన్నాడు" అని ప్రేమ వానిటీ బాగ్ నుండి కవరు తీసి ఇచ్చింది.

"నీ మీద ప్రేమ, నువ్వంటే ఆరాధనాభావం తప్ప మరే దృష్టి లేదని, తన తొందరపాటుకు పశ్చాత్తాపపడుతున్నానని చెప్పమన్నాడు" అంది ప్రేమ.

ప్రేమ ఇచ్చిన కవరును అక్కడి కక్కడే చించి

చేయాలనుకుంది. అయినా ఆమె ముందు ఆ పని చేస్తే ప్రేమ తనను కుసంస్కారిగా అనుకుంటుం దేమోనని ఆ ప్రయత్నం మానుకుంది.

"మాధవీ! సుధాకర్ చాలా మంచివాడు. జరిగిం దేదో జరిగింది. అతన్ని క్షమించు!"

మాధవి మాట్లాడలేదు. కొంతసేపు ఉండి ప్రేమ వెళ్ళిపోయింది.

ప్రేమ వెళ్ళిపోయిన తరవాత సుధాకర్ వ్రాసిన ఉత్తరం చదవాలనుకుంది. కాని మనస్కరించక ఆ కవరును సూటుకేసు అడుగున దాచేసింది.

* * *

కళ్ళు మూసుకున్నా స్థిమితం లేని మనస్సుకు నిద్ర పడుతుందా? అన్నిటినీ మరిపించి హాయి నిస్తుందా?

గతం పుటలు తిరుగుతూ, మనస్సంతా కల్లోలం రేపుతున్నా, మాధవికి సుధాకర్ వ్రాసిన ఉత్తరం చదవాలనే తపన ఎక్కువవుతూంది. తన కోర్కెను ఎంత బలవంతంగా అణచుకున్నా, మనస్సు అంత బలవత్తరంగా లాగుతోంది. అయిష్టం, ఇష్టం పెనుగులాడసాగాయి ఆమె ఆలోచనల్లో.

ఎంతకూ తేల్చుకోలేక, కణతలు నొక్కుకుంటూ లేచి, టేబిల్ మీద ఉన్న కవరు వైపు తీసడింపుగా చూసి, వంటింటి వైపు వెళ్ళింది.

మాధవి తల్లి తల ఎత్తి చూసింది.

"తలనొప్పిగా ఉంది. కొంచెం కాఫీ ఉంటే ఇయ్యవే!" అంది మాధవి గోముగా.

"ఈవేళప్పుడు కాఫీ ఏమిటే? ... ఇంతకీ ఆ ఉత్తరం ఎవరు వ్రాశారే!" అడిగింది తల్లి కాఫీకి నీళ్ళు పెడుతూ.

"ఏం లేదు. నా స్నేహితురాలి కో సమస్య వచ్చి తేల్చుకోలేక నాకు వ్రాసింది తేల్చమని."

"అందుకే నీకు తలనొప్పి వచ్చి ఉంటుంది. ఏమిటో ఆ సమస్య" అంది తల్లి ప్రశ్నార్థకంగా మాధవి వైపు చూస్తూ.

గోడకు ఆన్చిన పీటను వాల్చుకుని కూర్చుంటూ అంది మాధవి: "నా స్నేహితురాలు ప్రేమ నీ క్కూడా తెలుసుకదా! దానికే ఈ సమస్య మెడకి చుట్టుకుంది. అది నా మెడకు చుట్టి సలహా అడుగుతోంది."

"అట్టే నాన్చక విషయం చెబుదూ?" తల్లి ఉత్సాహం చూపింది.

"సరే, చెబుతాను. నా స్నేహితురాల్ని అపార్థం చేసుకోకు. నీ అభిప్రాయంచెప్పు." మాధవి మనస్సు తేలిక పడుతోంది.

"సరేలేవే! ప్రారంభించు." కాఫీ అందిస్తూ అంది తల్లి.

కాఫీ త్రాగుతూ "కాలేజీ చదివే రోజుల్లో ఒక అబ్బాయి ప్రేమను కాలేజీలో అవమానించాడు. ఆ అబ్బాయి స్వతహాగా మంచివాడే! ఒక రోజు ఆ అబ్బాయికి ప్రేమమీద చెప్పలేని ప్రేమ కలిగి ఆమె చెయ్యి పట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు. అంతే... ప్రేమ అతన్ని చెడామడాతిట్టి చెంపలు వాయించింది. ఆ తరవాత అతను కాలేజీ మానేసి వెళ్ళిపోయాడు. ఇప్పుడు అతనే పెళ్ళిచూపుల కొచ్చాడట. అతను మంచి స్థితిలో ఉన్నాడట. ప్రేమకు అతన్ని చేసుకోవడమా మానడమా అనే సమస్య పట్టుకొంది. నాకూ సరియైన సమాధానం దొరకలేదు" అంది మాధవి.

మాధవి తల్లి కొంతసేపు మాట్లాడలేదు.

తల్లి జవాబు ఎలా ఉంటుందోనని మాధవిలో భయం, కుతూహలం ముప్పిరిగొన్నాయి.

ఆలస్యం భరించలేక మాధవి అడిగింది: "ప్రేమకు ఏం వ్రాయమంటావే?"

ఆలోచించి సలహా ఇచ్చి, "ఇలా వ్రాసి చూడు ' అంది తల్లి మాధవితో.

తల్లి సలహా వినగానే తన అలజడి తగ్గినట్టయింది. అంతవరకు చెలరేగిన తుఫాను ఉద్ధృతం తగ్గి ప్రశాంతత ఆవరించినట్టయింది మాధవికి. మనస్సులో కొంత రిలీఫ్‌గా ఫీలయింది.

నెమ్మదిగా లేచి తన గదిలోకి వెళ్ళింది. గదిలో అడుగు పెట్టగానే టేబిల్ మీద ఉన్న కవరు మాధవి మనస్సులో మళ్ళీ అలజడి రేపింది.

అయినా తనను తాను నిగ్రహించుకొని సుధాకర్ వ్రాసిన ఉత్తరం చూడాలని కవరు చించి ఉత్తరం తీసింది.

తల్లి చెప్పిన మాటల్లో అసమంజస మేమీ లేదు. ఇన్నేళ్ళయినా కోపం చల్లారక తను వక్ర మార్గంలో కక్ష సాధింపుగా ఆలోచిస్తోందా? వచ్చిన అవకాశం తనే చేజార్చుకోవాలని చూస్తోందా?

తన ప్రశ్నలకు సమాధానాలు వెంటనే దొరకవు అని అనుకుంటూ ఉత్తరం విప్పింది చదవడానికి.

"ప్రియ మాధవీ!

ఇది నా రెండవ ఉత్తరం ..."

ప్రేమ తెచ్చిన ఉత్తరం గుర్తు కొచ్చింది. ఆ


సిల్ హౌటీ బ్యూటీ పార్లర్.
న్యూ ఢిల్లీకి చెందిన మిస్ జెన్నీ లీ
యిలా అంటున్నారు:

" ప్రతి ఒక్కరి జుట్టు వేరు వేరు తరహాకి చెంది ఉంటుంది. అందువల్ల నాకు గ్లీమ్‌పైన ఎంతో విశ్వాసం. అటువంటి ప్రత్యేకమయిన జుట్టును గూర్చి శ్రద్ధ తీసుకోవడానికే గ్లీమ్ షాంపూలు తయారుచేయబడినాయి."



ప్రతి గ్లీమ్ షాంపూ రకంలో ప్రత్యేకమైన జుట్టుకు అవసరమైన పదార్థాలున్నాయి. విపరీతమైన నురుగు, నిల్చి వెంటాడే గ్రెంది సౌరభం, మరి దాంతోబాటే ఎక్కువ కాలం నిలచే పొదుపూను!

| గ్లీమ్ రిగ్యులర్ | గ్లీమ్ ఎగ్ | గ్లీమ్ టానిక్ |
|---|---|---|
| మామూలు ఆరోగ్యమైన జుట్టును పరిశుభ్రంచేసి పట్టులా ఉంచి అతవేనుకొనేటట్లు లేక ముడివేసుకొనేటట్లు చేస్తుంది. | బలహీనమైన జుట్టును పరిశుద్ధమైన గ్రుడ్డు ప్రొటీన్‌తో శక్తివంతమైన దట్టమైన జుట్టుగా రూపొందిస్తుంది. | చుండ్రు, దురదలతో బాధపడేవారి సమస్యలతో కూడుతున్న జుట్టును శుభ్రపరుస్తుంది. |

ఇప్పుడు
వీలైన 60 మి.లి.
సైజులో కూడా




G-46 R

గ్లీమ్ షాంపూ
ప్రఖ్యాత హెయిర్ డ్రెసర్ల మెప్పు పొందినది.

Geoffrey Manners & Co. Ltd.

ఉత్తరం తనే కోపంతో ఇంతవరకు చదవలేదు. వెంటనే లేచి సూటుకేసులో బట్టల అడుగున దాచిన ఉత్తరం తీసింది.

"ప్రియ మాధవీ!

మిమ్మల్ని అల్లరి చేయాలని నా ఉద్దేశం కాదు. నీ పై నాకు ప్రేమ. ఆరాధన తప్ప మరే భావం లేదు. అర్థం చేసుకొని నన్ను క్షమించు.

ఎప్పటికైనా నీ వాణ్ణి కావాలని కోరుకునే ...

—సుధాకర్."

ఆ ఉత్తరం చదివేసరికి, అంతవరకు గాఢాడు కట్టుకొని ఉన్న కఠినత్వం సడలిపో సాగింది. ఎండి పోయిన చెలమలో నీరు ఊరుతున్నట్టుగా ఆమె మనస్సులో మార్దవం చోటు చేసుకోసాగింది.

ఆ ఉత్తరం ప్రక్కన పెట్టి రెండవ ఉత్తరం తీసింది.

"మనం శారీరకంగా దూరమయి నాలుగేళ్ళయినా, మానసికంగా నాకు చాలా దగ్గరయ్యావు. ఆ సంఘటన తరవాత నేను అక్కడే ఉంటే నీకు చాలా ఇబ్బందిగా ఉండవచ్చునని నేనే ఆ కాలేజీ వదులుకొని వెళ్ళిపోయాను. మీ రందరు అనుకున్నట్టు నేను మొద్దబ్బాయిని కాను. నీ పై ఉన్న ప్రేమతో నేను మనస్సును చదువుపై కేంద్రీకరించ లేదు. ఈ నాడు నే నేమిటో మీకు తెలుసు.

మీ అడ్రసుకోసం సంవత్సరంగా ప్రయత్నిస్తున్నాను. నా అదృష్టం కొద్దీ లభించింది. ఇప్పటికైనా నీకు నా పై కోపం తగ్గి ఉంటుం దను కుంటాను.

నీకు ఇష్టమైతే ప్రత్యుత్తరం వ్రాయ నవసరం లేదు. ఇష్టం లేని ఎడల ఈ ఉత్తరం చేరినట్టు వ్రాయి.

—సుధాకర్."

ఉత్తరం మళ్ళీ మళ్ళీ చదివింది ఉత్తరం చదువుతున్నంత సేపూ మథనపడసాగింది. సుధాకర్ ఒక వైపు, అతను తనను అవమానించడం, తను పడ్డ మానసిక క్షోభ, ఆ కారణంగా జబ్బుపడడం, తన స్నేహితులంతా తలా ఒక రకంగా అనుకోడం మరో వైపు—రంగుల రాట్నంలా తిరగసాగాయి ఆమె మనోనేత్రం ముందు ... అతనికి తనంటే ఎంత ప్రేమ, ఆరాధన ఉన్నాయి ... అతని ఆ నాటి ప్రవర్తన తన జీవితంలో మాయని మచ్చ ... అతను ఈ నాడు కలెక్టరు. అతని వలన తనక్కూడా గొప్ప హోదా ... గతం మాసిపోయినా గాయం మాసిపోదు. తన స్నేహితులు తన్ను గుచ్చి గుచ్చి చూస్తారు. తను మరి దేన్నయినా భరించగలదు కాని, అవమానాన్ని భరించలేదు ... సుధాకర్ స్వతహాగా సౌమ్యుడు. అతనికి తనపై ప్రేమ లేకుంటే అలా ప్రవర్తించే వాడు కాదు. అలా అతను ఏ ఆడపిల్లతోను ప్రవర్తించ లేదు. తనపై ఈ నాటికీ అతనికి ప్రేమ ఉంది. అతన్ని చేసుకోవడానికి ఆడపిల్లలే దొరకరా... కానీ అతను తననే కోరుతున్నాడు. ప్రేమించే భర్తకన్న మరేం కావాలి ... తల్లి చివరగా చెప్పిన మాట గుర్తు కొచ్చింది. "రేగి పళ్ళ చెట్టుకు ముళ్ళుంటాయని పళ్ళు కోసుకోమా? ఏదో ఒక చిన్న మిషతో కోరిన వ్యక్తిని నిరాకరించడం తెలివైన పని కాదు. తృణీకరించడం తేలికే. స్వీకరించడంలోనే ఉంది విజ్ఞత."



తను ఎమ్.ఎ. చదువుకున్నా తల్లి కున్న విజ్ఞానమే ఎక్కువనిపించింది మాధవికి.

కానీ అతని అసభ్య ప్రవర్తన ...?

మాధవి మనస్సు అటూ ఇటూగా ఉంది.

కొంతసేపటికి నిర్ణయాని కొచ్చి కాగితం, కలం తీసుకొంది ప్రత్యుత్తరం వ్రాయడానికి.

సుధాకర్‌కు, మాధవికి పెళ్ళయిపోయింది.

తొలినాటి రాత్రి మాధవి అంది, "మీ ఉత్తరానికి జవాబు వ్రాసి, ఇప్పుడు అందివ్వాలని దాచి ఉంచాను." మంచం కింద ఉన్న సూట్ కేస్‌ని తెరిచి ఉత్తరం తీసి అందించింది.

సుధాకర్ ఆశ్చర్యపోయాడు. అందుకొని ఆత్రతగా చదివాడు.

"మీ ఉత్తరం నా గుండెలో దాచుకున్నాను.

—మీ మాధవి."

ఆనందంతో సుధాకర్ మాధవిని దగ్గరగా తీసుకుందామని అనుకుంటుండగా అప్పటికే మాధవి సిగ్గుతో అతని ఎదలో ముఖం దాచుకుంది. ✱

## మీ కుపయోగించేది

కుటుంబంలో ఎవరికి ఏ రోగం వచ్చినా కంగారు పడే పని లేదు. అయిదు రకాల ప్రఖ్యాత వైద్యులు, ప్రతి రోగానికీ, ఇంగ్లీషు, ఆయుర్వేద, హోమియో, ప్రకృతి మూలికా మందుల వివరాలు అందరికీ తెలిసేలా "ఐదు వైద్య విధానాలు" అనే తెలుగు పుస్తకములో వ్రాశారు. అన్ని షాపుల్లో దొరికే మందులే. 427 రోగాల విముక్తి మార్గాలున్నాయి. వెల: రూ. 16/—. పోస్టేజి ఖర్చులు అదనం.

**దేశసేవ ప్రచురణలు,** 5/3 ఆర్.టి. పంజాగుట్టకాలనీ, హైదరాబాద్—4 కు మీకో పుస్తకం వి. పి. పోస్టుద్వారా పంపమని వెంటనే వ్రాయండి.

Swastik

## సపట్ మలామ్



తామర, గజ్జి, చిడుము
పాదములమీద మరియు వేళ్ళ మధ్య పగుళ్లను
పోగొట్టుటకు దివ్యమైనది.

SAPAT & CO., BOMBAY 2.

ఏజంట్లు: ది ట్రేడ్ ప్రోమోటింగ్ కార్పొరేషన్,
ఒన్టిపేట, విజయవాడ—520010